

మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

బీసీలకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

రాంనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన 14 బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో సగం ఉన్న బీసీల సంక్షేమాన్ని కేంద్రం విస్మరించిందన్నారు. మండల్ కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీమ్‌లకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయాలలో చదివే ఐఐటీ, ఐఐఎం విద్యార్థులకు ఫీజులు చెల్లించాలన్నారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలని, బీసీ కార్పొరేషన్ బడ్జెట్ సంవత్సరానికి రూ. 50 వేల కోట్లు కేటాయించి ప్రతి కుటుంబానికి 10 నుంచి 50 లక్షల వరకు 80 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్ల సాధన కోసం త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, సి. రాజేందర్, అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, పి. సతీష్, రవీందర్, నిఖిల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పరిశుభ్రత పనులు



బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లో అమ్మవారి ఆలయాల వద్ద మట్టికుప్పలు, చెత్తాచెదారం తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రారంభించింది. ఆదివారం సబర్మతినగర్‌లో పోచమ్మ ఆలయం వద్ద మట్టి, చెత్త కుప్పలను తొలగించారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థ అర్పిత వివిధ రంగాల్లో నిష్ణాతులకు అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. విద్య, వైద్యం, సాహిత్యం, ఆధ్యాత్మికత, క్రీడ, సమాజసేవ, విధి నిర్వహణ, సాంస్కృతిక సేవా రంగాల్లో నిష్ణాతులకు అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ అధ్యక్షుడు డా. గణగళ్ల విజయ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గలవారు 93913 79903 వాట్సాప్ నంబర్‌కు వివరాలు పంపించాలని కోరారు. ఎంపికైన వారికి ఆగస్టు 26న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు.

మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సూఫీ ఉన్మా కౌన్సిల్ సభ్యుడు

కవాడిగూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆలిండియా సూఫీ ఉల్మా కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అధీనంలో ఉన్న మదర్సాలను తెహరిక్ సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మైనార్టీల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, సూఫీ ఉన్మా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐ మృతికి కారణమైన సీఐని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

కవాడిగూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారణమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేసి సర్వీస్ నుంచి తొలగించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్ల మూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ, డీజీపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటన జరిగి 22 రోజులు అయినా ఇప్పటి వరకు సీఐపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, రాష్ట్ర కార్యదర్శి బి. రమేష్, ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

చిక్కడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస కల్యాణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దాదాపు మూడువందల మందికి అన్నదానం చేశారు. వరాల జ్యోతిష్యాలయం గురువు శ్రీధర్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆయన శిష్యబృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ట్రస్ట్ చైర్మన్ శుద్ధికట్ల స్వప్న, సంపత్‌కుమార్, రాజేంద్రప్రసాద్, కుంచారం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రచయిత్రి శీలా సుభద్రాదేవి

జీవితాంతం విరామం ఎరుగని

కలం యోధుడు నిర్మలానంద

రాంనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సాహిత్యోద్యమ సమష్టి కృషితో జీవితాంతం నిబద్ధతతో విరామం ఎరుగక శ్రమించిన కలం యోధుడు నిర్మలానంద అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్మలానంద 6వ వర్ధంతి సభ సందర్భంగా నేటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు - సాహితీ సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు అనే అంశంపై సభ జరిగింది. ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి, రచయిత నాళేశ్వం శంకరం, యం. లక్ష్మి మాట్లాడారు. నిర్మలానంద దోపిడీ పీడనలు, అంతరాలు, హింసలేని సమాజాన్ని ఆకాంక్షించారని అన్నారు. పీడిత ప్రజల విముక్తిని బలంగా కాంక్షిస్తూ ఇతర భాషల్లోకి సాహిత్యాన్ని తెలుగులోకి, తెలుగు నుంచి హిందీలోకి అనువదించారని గుర్తు చేశారు. జనసాహితీ జంటనగరాల శాఖ కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు.



బాగ్‌లింగంపల్లిలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కె. రవిచారి తదితరులు



అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు



ముషీరాబాద్ సంజీవయ్యనగర్‌లో సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



అంబర్‌పేట పటేల్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

ఘనంగా గురుపౌర్ణమి



జెమినీకాలనీ సాయిబాబా ఆలయంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు



బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయంలో పూజల్లో మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెండు నియోజకవర్గాలోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు ఉదయం 6 గంటల నుంచే సాయిబాబా ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద కూడా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకల్లో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్, కార్పొరేటర్లు కె. రవిచారి, బి. పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్లు వి. శ్రీనివాస్‌రెడ్డి, కె. పద్మావతిడీపీరెడ్డి, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.



పార్సీగుట్ట ఈస్ట్ మునిసిపల్ కాలనీలో సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ భూమయ్య, సభ్యులు శశిధర్‌రెడ్డి, ప్రేమలతారెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు



ముషీరాబాద్ బాపూజీనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు ఆర్.ఎల్ రమేష్, నాయకులు

అమ్మవారికి బోనం సమర్పణ



కవాడిగూడ మునిసిపల్ గ్యారేజీలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ జి. రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోనాల వేడుకలను కవాడిగూడ డివిజన్‌లో ఆదివారం పలు ఆలయాల్లో అంగరంగవైభవంగా నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మునిసిపల్ గ్యారేజ్‌లో స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎం. అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులను నిర్వాహకుడు బండారి యాదగిరి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పూసరాజు, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల బ్రోచర్ ఆవిష్కరణ

బర్కత్‌పుర, జూలై 21(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న తెలంగాణ బోనాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతో పాటు భారతీయ ఆధ్యాత్మికతలో విశిష్ట స్థానం ఉందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలో నగర కార్యాలయంలో బోనాల వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

మహాకాళికి తొలిబోనం..

ముషీరాబాద్: వందేళ్ల చరిత్రగల మహాకాళి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకుడు వై. చంద్రమౌళి ఆదివారం తొలి బోనం సమర్పించారు. ముషీరాబాద్‌లోని తన నివాసం నుంచి డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి బోనంతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి అమ్మవారికి తొలిబోనం సమర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లబస్తీలో..

కవాడిగూడ తాళ్లబస్తీలో ఆదివారం ఉదయం తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చి ఒడిబియ్యం, బోనాలు, సాక సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వారకు తొట్టెల ఊరేగింపుతో బోనాలతో వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బాకారం పోచమ్మ ఆలయంలో..

రాంనగర్: బాకారం పోచమ్మ ఆలయంలో అమ్మవారికి వెయ్యికండ్ల తొలి బోనం కుమ్మరులు నాగరాజు లావణ్య ఆధ్వర్యంలో ఆదివారం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి సందీప్‌గౌడ్, బాకారం ధర్మాచరణ సమితి అధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ మహాకాళి దేవాలయంలో అమ్మవారికి తొలి బోనం తీసుకెళ్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి తదితరులు



బాకారం పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పిస్తున్న కుమ్మరులు

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

బర్కత్‌పుర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, రూ. 10 వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందుగానే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14న తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పి. సురేందర్‌రెడ్డి, జానకీరెడ్డి, నరేందర్‌గౌడ్, ఇంద్రకుమార్, యాదిరెడ్డి, కొండస్వామి, దయానంద్, భాస్కర్, కిరణ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి

బర్కత్‌పుర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతిచెందాడు. కాచిగూడ రైల్వేపీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్‌కుమార్ సింగ్(50) ఆరాంఘర్‌లో నివసిస్తూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీకి వెళ్లడానికి బుద్వేల్-శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆరాంఘర్ బ్రిడ్జి వద్ద పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి రూ. 50 లక్షలు అపహరణ

రాజేంద్రనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్‌లో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వాచ్‌మెన్‌లను బెదిరించి రూ. 50లక్షలు అపహరించారు. రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌కుమార్ 'భారతి ట్రేడర్స్' పేరుతో బుద్వేల్‌లో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 19న ఓ కంపెనీ నుంచి రూ. 21 లక్షలు, శనివారం సాయంత్రం మరో కంపెనీ నుంచి రూ.29 లక్షలు రాగా, మరికొంత డబ్బును పరిశ్రమలోని వాచ్‌మన్ గదిలో బీరువాలో పెట్టారు. కంపెనీలో వాచ్‌మెన్‌లుగా నరేష్‌కుమార్, కృష్ణ పనిచేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు గేటు దూకి పరిశ్రమలోకి చొరబడ్డారు. కత్తి, ఇనుపరాడ్లతో వాచ్‌మెన్‌లను బెదిరించి బీరువాలో ఉన్న రూ. 50 లక్షలను దోచుకెళ్లారు. వాచ్‌మన్‌లు విషయాన్ని యజమాని మహేందర్ కుమార్‌కు చెప్పగా.. ఆదివారం ఉదయం మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీఐ భిక్షపతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను ఆదివారం బెంగళూరులో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ సీనియర్ నాయకుడు, ప్రియాంక-రాహుల్ గాంధీ యువసేన అధ్యక్షుడు నంది నరహరి. **- రాంనగర్, ఆంధ్రజ్యోతి**



సోమాజిగూడ జయ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అంబర్‌పేట బీజేపీ నేతలు దాసోజు నాగభూషణం చారి, మైలారం రాజు, వెంకటస్వామిగౌడ్, భిక్షపతి, మాణిక్‌ప్రభు, కృష్ణముదిరాజ్ తదితరులు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

అండర్ వాటర్ పిన్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో

స్టీఫెన్‌కుమార్‌కు మూడు పతకాలు



పతకాలతో స్టీఫెన్‌కుమార్

బర్కత్‌పుర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన అండర్ వాటర్ పిన్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ (టీఎంఏఎస్) పోటీలలో బర్కత్‌పురకు చెందిన స్టీఫెన్‌కుమార్ మూడు పతకాలు సాధించారు. స్విమ్మింగ్ రిలే పోటీలో రజత, మోనోపిన్ 50 మీటర్ల స్విమ్మింగ్ పోటీలో కాంస్యం, మోనోపిన్ 100 మీటర్ల బైఫిన్ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించారు. స్టీఫెన్‌కుమార్‌ను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రముఖ స్విమ్మర్ క్వీనీ విక్టోరియా తదితరులు అభినందించారు.

బర్కత్‌పుర డిపో మేనేజర్‌గా మంజుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుల

బర్కత్‌పుర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్‌గా మంజుల ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ డీఎంగా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను హెడ్ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. డిపోను ఆదర్శంగా నిలిపేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. సమయానికి బస్సులు నడిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

హబ్సిపూరా... హర్రాస్‌పెంటలో బ్రాహ్మణ అపర కర్మల భవనం

గోల్నాక, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హర్రాస్‌పెంటలో బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన బ్రాహ్మణ అపర కర్మల భవనాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు. భవనాన్ని తన సొంత నిధులతో నిర్మించిన జయశ్రీ మోహన్‌రావు పోచంపల్లిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో హిందూ శ్మశాన వాటిక ప్రబంధ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు, నాయకులు అనిల్‌కుమార్, బండా సూరి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన 'ఆప్' నేత

బర్కత్‌పుర. జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మంచాల శ్రీకాంత్ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)లో చేరారు. ఆదివారం బర్కత్‌పురాలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి బానోతు రవీంద్రనాయక్ సమక్షంలో బీఎస్పీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీఎస్పీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.



జేఎన్‌టీయూ అందజేసిన నాణ్యతా పత్రం చూపిస్తున్న జనార్దనమూర్తి తదితరులు

త్యాగరాయగానసభకు జేఎన్‌టీయూ నాణ్యతా పత్రం

చిక్కడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభ కట్టడం పటిష్ఠంగా ఉందని జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నాణ్యతా పత్రం అందజేశారని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గానసభ కట్టడంపై జేఎన్‌టీయూను సంప్రదించగా.. ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పదిమంది నిపుణులు శనివారం పరిశీలించి అన్ని పేరామీటర్స్‌లోనూ దృఢంగా ఉందని నాణ్యతా పత్రం అందజేశారని వివరించారు. విలేకరుల సమావేశంలో గానసభ కార్యవర్గసభ్యులు, హాస్యావధాని శంకరనారాయణ, చక్రపాణి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పార్టీ కోసం కష్టపడేవారికి పదవులు'

ముషీరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి పదవులు వస్తాయని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎండీ మోహిన్ అన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో కృషి చేస్తున్నందుకు ఆదివారం అభినందిస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, భిక్షపతి యాదవ్, అజయ్ ముదిరాజ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'రేపటి తరం భవిష్యత్ కోసం గ్రీన్ కన్స్యూమర్ కమిటీలు'

చిక్కడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రేపటి తరం భవిష్యత్ కోసం గ్రీన్ కన్స్యూమర్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఆదివారం గోల్కొండ చౌరస్తాలోని మండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపటి తరానికి నీరు, నీడ, కూడు, గుడ్డ మిగిల్చే దిశగా మన వినియోగం ఉండాలన్నారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ పల్లెపాడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన భార్యాపిల్లలు భర్తకు అప్పగింత

చిక్కడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన భార్యాపిల్లలను చిక్కడపల్లి పోలీసులు భర్తకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన పెండు ప్రవీణ్, అనూష భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు శ్రీవిద్య, అక్షిత. ఆదివారం ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపం చెందిన అనూష ఇద్దరు పిల్లలను తీసుకొని ఉదయం 8 గంటల సమయంలో ఇంటినుంచి వెళ్లిపోయింది.

ప్రవీణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా అనూష, పిల్లలు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉన్నట్లు తెలియడంతో వారిని సాయంత్రం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రవీణ్‌ను పిలిపించి భార్యాపిల్లలను అతడికి అప్పగించారు.